
# సత్యవాక్యం

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER - 2008

సంవత్సర చందా రూ. 50/-

## సంక్షిప్త వార్తలు - 1

2008 నవంబరు 22వ తేదీనాడు అమెరికా దేశము నుండి సోదరులు బిల్లీ బ్లాండ్, రేమేపుల్స్, బ్రెండా మేపుల్స్, జెర్రీ మేనింగ్ మరియు డిలాన్ కూపర్ గార్లు భారతదేశ పర్యటన నిమిత్తము వచ్చిరి. 23 వ తేదీ ఆదివారం సత్యవాణి క్రీస్తు సంఘ ఆరాధనలో పాల్గొనిరి. బిల్లీ బ్లేండ్ గారు ఆరోజు వాక్యపరిచర్య చేసిరి.

నవంబరు 25వ తేది మంగళవారం పై బృందము సువార్త పర్యటన నిమిత్తము వాడపర్రు వెళ్లి అక్కడ వాక్యపరిచర్య చేయగా ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 27 వ తేదీ గురువారం దేవగుప్తంలో జరిగిన సువార్త కూటములో పాల్గొని వాక్య పరిచర్య చేయగా ఒకామె బాప్తిస్మము పొందెను. తదుపరి వారు సామంతకుర్రు గ్రామమును దర్శించిరి.

ఇది ఈ లాగుండగా నవంబరు 30 వ తేదీనుండి జరుగుబోవుచున్న ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో పాల్గొనుటకు ఆ వారాంతములోగా అమెరికానుండి, ఆస్ట్రేలియా నుండి, మణిపూర్ నుండి పలువురు సువార్తికులు విమాన ప్రయాణానంతరం కాకినాడ చేరుకొనిరి.

నవంబరు 30వ తేదీన ఆదివారం ఉదయం ఓక్లహోమ నుండి వచ్చిన సోదరులు జిమ్ కెల్లీగారు ఈ యేసు ఎవరు? అను అంశముపై గంభీరోపన్యాసము చేసిరి. సభికులంతా ఆత్మీయముగా కదిలించబడిరి. మధ్యాహ్న కాలములోను, రాత్రి వేళ జరిగిన కూటములోను సోదరులు జెర్రీమేనింగ్ గారు ధనాన్ని గూర్చి చేసిన బోధలను గూర్చియు, బిల్లీ బ్లేండ్ గారు ఆరాధన అంశము పైనను గంభీరము గా బోధించిరి. ఆయా అంశములపై పలు సత్య సంగతులను సభికులకు తెలియ చేసిరి.

2008, డిసెంబరు మొదటి తేది సోమవారం నాడు సెర్రీ మేనింగ్ గారు ఆత్మీయ సామ్రాజ్యమును గూర్చియు, బిల్లీ బ్లేండ్ గారు సంఘమును గూర్చియు ఉదయకాలమున ప్రసంగించిరి. ఈ లోకమందు దరిద్రులైనవారిని దేవుడు విశ్వాసములో భాగ్యవంతులుగా చేసినని (యాకోబు 2:5) జెర్రీ గారు, క్రీస్తు ఏకైక సంఘమును స్థాపించెనని, అదే దేవుని రాజ్యమని బిల్లీ బేండ్గారు ఉపదేశించిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి -29 | డిసెంబరు 2008 | సంచిక 5


## మానవుడు నైతిక స్వేచ్ఛ కలిగిన వాడు

### ( Man a free moral Agent)

దేవుడు మానవుని సృజించినప్పుడు అతని ఒక యాంత్రిక జీవిగా తయారు చేయలేదు, గాని నైతిక స్వేచ్ఛను కలిగినవానిగా అతని చేసెను. మానవుడొక నైతిక జీవి. అతనికి ఒక అంతరాత్మ లేక మనసాక్షి యున్నది. అతడేదైన చెడ్డపని చేస్తే అతని మానస్సాక్షి గద్దించును. మంచి చేస్తే అది సంతోషించును, ఆదరణను అను గ్రహించును. అందువలన మానవులు వారిదైనందిన .జీవితాల్లో నైతిక సూత్రములను లేక నైతిక కట్టడలను కలిగి తమ మనస్సాక్షిని బట్టి జీవించ ప్రయత్నిస్తారు.

మానవుడు నైతికంగా స్వేచ్ఛ గలవాడు అని మనం చెప్పుకొన్నాం. అంటే అతడు మంచి - చెడుల ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకొనడానికి స్వేచ్ఛ కలిగినవాడు. మానవుడు విధేయత చూపుటకు గాని సంపూర్ణ బాధ్యత గలవానిగా దేవుడతని సృజించెను. ఒకవేళ మానవుడు అవిధేయత చూపి, పాపము చేసి నిత్య నాశములోనికి పోయినను, దేవుడు

న్యాయవంతుడగును.

మానవుని ఎంపిక చేసుకొనే హక్కును దేవుడతనికి అనుగ్రహించెనని బైబిలు చెప్పుచున్నది. మీరు ఎవరిని సేవించెదరో నేడు కోరుకొనుడి. అయితే నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అని ఇశ్రాయేలీయులకు యెహోషువ హెచ్చరిక చేసాడు (యెహోషువ 24 : 15). మానవులకు దేవుడు తన ఆజ్ఞలను తెలియజేసి, వారు వాటికి లోబడాలని కోరును. "నేడు జీవమును, మరణమును ఆశీర్వాదమును శాపమును నేను నీయెదుట ఉంచి, భూమ్యాకాశములను మీ మీద సాక్షులుగా పిలుచుచున్నాను" అని ఆయన ఇశ్రాయేలీయులకు చెప్పెను (ద్వితీ 30 :19).

" మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనము కంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు" విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంటకోయునని" అతడెరుగును (గలతీ 6:8). క్రైస్తవుడు శోధింపబడునప్పుడు, దానిని తప్పించుకొనే మార్గమును దేవుడు కలుగజేయును (1కొరింథీ 10 :13). తప్పించుకొనే మార్గాన్ని ఆయన కలుగజేయును గాని, తప్పించుకోవాలో, వద్దో మానవుడు ఎంచుకోవాలి.

మోషే దేవునితో ఉండుటకు ఎంచుకొంటే , యితరులు దుష్టత్వాన్ని ఎంచుకొన్నారు. "ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంటకోయును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (గలతీ 6:8). "వారు గాలిని విత్తియున్నారు గనుక ప్రళయ వాయువు వారికి కోతయగును" (హోషేయ 8:7). "నేను చూచినంత వరకు అక్రమమును దున్ని కీడును విత్తువారు దానినే కోయుదురు " (యోబు 4:8). "అయితే నేను దేవుని నాశ్రయించుదును దేవునికే నా వాజ్యమును అప్పగించుదును" అని యోబు చెప్పుచున్నాడు (యోబు 5:8).

మానవుని ఆత్మ రక్షణ విషయములో కూడ అతనికి ఎంపిక చూసుకొనే హక్కు ఉన్నది. మానవులకు దేవుడు తన ఆజ్ఞల నిచ్చారు. వాటికి లోబడే తరుణాన్ని మానవులు కలిగియున్నారు. పెంతుకొస్తు దినమందు పేతురు ఆనాటి యూదులకు ఒక తరుణం యిచ్చాడు. "మూర్ఖులగు

ఈతరము వారికి వేరై రక్షణ పొందుడియని హెచ్చరించాడు (అ.పొ.కా. 2:40). "మీరు మార్పునొంది తిరుగుడి" యని మరొకమారు అతడు హెచ్చరించాడు. ( (అ.పొ.కా. 3:19). మీరు భయముతోను, వణుకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి యని పౌలు హెచ్చరించాడు (ఫిలిప్పీ 2:12). "అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి" యని పేతురు క్రైస్తవులను హెచ్చరించాడు (2 పేతురు 1:10).

ఈ ఎంపిక, నిశ్చయతలకు కారణము లేకపోలేదు. మనలో ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరును మారుమనస్సు పొందవలెనని దేవుడు మనయెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు (2 పేతురు 3:9). అయినను ఆయన నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు (అ.పొ.కా. 17:31). మానవులు దేవునికి లోబడుటకు ఎంచుకొనకపోయిన యెడల వారు నిత్య నాశనములోనికి పోవుదురు. "నేను పిలువగా మీరు వినకపోతిరి, నా చేయిచాపగా ఎవరును లక్ష్య పెట్టక పోయిరి. నేను చెప్పిన బోధ యేమియు మీరు వినక త్రోసి వేసితిరి. నేను గద్దింపగా లోబడకపోతిరి కాబట్టి మీకు అపాయం కలుగునప్పుడు నేను నవ్వెదను. మీకు భయము వచ్చినప్పుడు నేను అపహాస్యము చేసెదను. మీకు కష్టమును దుఃఖమును ప్రాప్తించునప్పుడు నేను అపహాస్యము చేసెదను" అని సర్వజ్ఞానియైన దేవుడు సెలవిచ్చుచున్నాడు (సామె. 1:24-27). గనుక మనం నిత్యత్వాన్ని ఎక్కడ ఎట్లు గడపాలో మనమే నిర్ణయించుకోవాలి. అది నిర్ణయించుకొనే స్వేచ్ఛను దేవుడు మనకిచ్చి యున్నాడు. ఆయన జీవాన్ని, మరణాన్ని కూడా మన ముందుంచి యున్నాడు. ఆయన ఆజ్ఞల చొప్పున నడుచుకొంటే జీవములో ప్రవేశించుదుము. ఆయన ఆజ్ఞలను నిరాకరిస్తే మరణములో ప్రవేశించుదుము.

యేసు ప్రభువు "ఇరుకు ద్వారమును ప్రవేశించుడి : నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది. దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవవమునకు పోవు ద్వారము ఇరుకునను, ఆదారి సంకుచితమునై యున్నది. దాని కనుగొను వారు కొందరే" యని బోధించారు. (మత్తయి 7:13,14) మరియు "యేసు –నేనే మార్గమును,

సత్యమును, జీవమును, నాద్వారానే తప్పు యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పారు (యోహాను 14:6). "మరల యేసు –నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించు వాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండునని" చెప్పెను (యోహాను 8:12).

మరల , సువార్తను "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును : నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడునని" అయన చెప్పారు. వీటన్నిటిలోను నిర్ణయించుకొనే అధికారము మనకే విడిచిపెట్టబడియున్నది. అయితే అన్ని విషయములలోను మనం శ్రేష్టమైన సంగతులనే ఎంచుకొనాలని ఆయన కోరుచున్నాడు. ఆయన ఎవరిని బలవంతము చేయడు. అందువలననే మన నైతిక స్వేచ్ఛను సద్వినియోగం చేసుకొని నిత్యజీవంలో ప్రవేశించుటకు ఎంచుకొందురనియే నా నిరీక్షణ.

Rust as a witness - 3

# ఇచ్చుట ఒక బైబిలు అంశము

## (Giving is a Bible Subject)

గత పాఠంలో పాతనింబధన అధ్యాయములో తూర్పు దేశపు జ్ఞానులు వచ్చి ఇచ్చుటను గూర్చిన గ్రంధమని గ్రహించావము. ఈ ప్రాముఖ్య అంశమును గూర్చి క్రొత్త నింబంధన యేమి బోధించుచున్నదో అ పాఠంలో గమనించుదాము. క్రొత్తనిబంధన లోని మొదటి నాలుగు పుస్తకములు యిచ్చుటను గూర్చి ఎక్కువ బోధించుచున్నవి. క్రొత్తనిబంధనలోని మొదటి అధ్యాములోనే యేసు క్రీస్తు యొక్క జననమును గూర్చి చదువుతాము. మానవులకు ఆయన దేవుడిచ్చిన బహుమానము, రెండవ యేసుకు యిచ్చిన మొదటివారయ్యారు. నేడు మనం యిచ్చేది క్రీస్తుకే, సంఘములో మనం చేసేదంతా ఆయన లోనే కేంద్రీకృత మవ్వాలి, ఆయన కొరకే చేయబడాలి.

తూర్పుదేశపు జ్ఞానుల నుండి మనం గొప్ప పాఠములను నేర్చుకొనవచ్చును. ఇచ్చుటను గూర్చి చెప్పకుండ మనం క్రీస్తును గూర్చి గాని ఆయన రాజ్యమును గూర్చి గాని బోధించలేము. మనం బైబిలును చదువునప్పుడు దేవుడిచ్చాడనీ, క్రీస్తు యిచ్చారనీ, పరిశుద్ధాత్ముడు ఇచ్చారనీ తెలిసికొంటాము. ఆదిమ క్రైస్తవులు క్రీస్తుకు

నమ్మకముగా యుండుటలో ఎక్కువ ఇచ్చారని క్రొత్తనిబంధన చదువుట ద్వారా తెలిసికొన గలము. నాలుగు సువార్తలలోను ఇచ్చుటను గూర్చి చదువుతాము. మత్తయి,మార్కు,లూకా, యోహాను సువార్తలలో 89 అధ్యాయములున్నాయి. ఇచ్చుటనుగూర్చి వాటిలో 123 సార్లు చెప్పబడింది,

అపొస్తులులు కార్యముల గ్రంధమే కాకుండా అపొస్తులులు చేసిన పనులను గూర్చిన గ్రంధము, ఆయా సంఘాలకు వ్రాయబడిన పత్రికలు పదేపదే ఇచ్చుటను గూర్చి బోధించుచున్నవి. దేవుడు మానవునికి ఒక నూతన గృహం యిస్తూ ప్రకటన గ్రంధము ముగియు చున్నది. ఆదికాండము మొదలుకొని ప్రకటన గ్రంధము చివరి వరకు బైబిలు ఇచ్చుటను గూర్చిన గ్రంధమని నీవు గమనించ గలవు.

**యేసు ఇచ్చుటను గూర్చి బోధించారు**

"భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొన వద్దు, ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును.దొంగలు కన్నము వేసి దొంగిలిదెరు. పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి, అచ్చట చిమ్మెట యైనను, తుప్పైనను దానిని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు" (మత్తయి 6:19-20).

కొందరు తాము అభివృద్ధి చెందిన కొలదీ దేవునికి ఇయ్యరు. నీవున్న పాటునే మరణిస్తే నీ ఆస్తి ఎవరిదౌతాది? అపొ.పౌలు ఇట్లు చెప్పాడు : "నా అవుసరముల నిమిత్తమును నాతో ఉన్నవారి నిమిత్తమును ఈ నా చేతులు కష్టపడినవని మీకే తెలియును, మీరును ఈలాగు ప్రయాసపడి బలహీనులను సంరక్షింప వలెననియు పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము అని ప్రభువైన యేసు చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనవలెననియు అన్ని విషయములలో మీకు మాదిరి చూపితిని" (అ.పొ.కా.20.33-35).

యేసు ప్రభువు స్వార్ధపరులను, లోభులను నిశితంగా ఖండించారు. స్వార్ధపరుడైన రైతును ఆయన ఓయీ వెర్రి వాడాయని పిలిచారు. ఆయన యాజకుని, లేవీయుని ఖండించి సమరయుని అభినందించారు. "నీవు పోయి అలాగు చేయుమని ఆయనను ప్రశ్నించిన వానికి జవాబిచ్చారు. మార్కు 12 లో ఆయన బీద విధవ రాలిని అభినందించారు. లోభియైన ధనవంతుడు నరకములోను, బీద లాజరు పరదైసులోను యున్నట్లు ఆయన చిత్రీకరించారు. విలువైన జటామాంసి అత్తరు బుడ్డి పగులగొట్టినందుకు మరియను ఆయన శ్లాఘించంచి, ఆమెను విమర్శినందుకు ఇస్కరియోతు యూదాను ఖండించారు.

యేసు ఇచ్చుటను గూర్చి బోధించుటయే గాక ఆయన తన స్వంత ప్రాణము నిచ్చి గొప్ప మాదిరి చూపించారు. "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని" ఆయన చెప్పెను (మత్త 20:28). ఎవడైన తన శిష్యుడు కాగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని ఆయనను వెంబడింపవలెనని యేసు బోధించారు (మత్త 16:24).

ఒకని ధనము విస్తరించుట వలన అది జీవమునకు మూలము కాదని యేసు బోధించారు. నిజమైన జీవితం ధనాన్ని సమకూర్చుటలో గాక ఇచ్చుటలో సాధించవచ్చును. ధనవంతుడైన యువకుడు ఈ లోక సంబంధమైన అస్థితోనే జీవం అంతా యున్నదనుకొన్నాడు. అతడు ముఖము చిన్న బుచ్చుకొని పోయాడు.

**ధనాన్ని గూర్చి క్రొత్తనిబంధన బోధించుచున్నది.**

" ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము ; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1తిమో6:10).

ధనం మోసకరమైనది ; మనుష్యులను దాని స్వంతం చేసుకొనె శక్తి దానికున్నది, అది మానవుని ఆత్మను పాడు చేయు శక్తి గలది.

ఆర్థికంగా అభివృద్ధిజెందేకొలదీ సంఘంమే ప్రాముఖ్యస్థానము నలంకరించాలి. సహోదరులారా, మనం మేల్కొనాలి . ధనం విషయమైన మన యభిప్రాయములు మార్పుజెందాలి. ఏ యుగములో నైన దశమ భాగము కంటే తక్కువ యిచ్చిన వారు దేవుని యనుమతి బడసినట్లు ఎక్కడా కనుగొనము.

## లోభత్వము

"కావునా భూమీ మీద నున్న మీ అవయువములను అనగా జారత్వమును అపవిత్రతను కామాతురతను దురాశను విగ్రహారాధన యైన ధనాపేక్షను చంపివేయుడి. వాటి వలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును" (కొలస్స 3:5 -6).

ధనాపేక్ష మోసకరమైనది గనుక అది ప్రమాదకరమైనది. అది ఒక కేన్సర్ వ్యాధి లాంటి ది. మానవుడు గ్రహించకముందే అది అతని ముఖ్య లక్షణములను క్షీణింపజేయును. ప్రజలు అన్ని రకాల పావములను ఒప్పుకొంటారు గాని దనాపేక్ష లోభత్వమును ఒప్పుకొనరు. ధనాపేక్ష

మోక్షానికి చేర్చదు.

**మనం యిచ్చే విధానాన్ని దేవుడు గమనించుచున్నారు.**

"శ్రేష్టమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చును : ఆయన యందు ఏచంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏఛాయయైనను లేదు. ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమ ఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకోబు 1:17).

దేవుడు మనకిచ్చిన మంచి సంగతులన్నింటిని గూర్చి మనం కృతజ్ఞత కలిగియుండాలి. గాలి, నీరు, సూర్యరశ్మి, వర్షము,అన్నమయము, ఉదయం మొదలగు లక్షలాది యీవులను గూర్చి మనం కృతజ్ఞత కలిగి యుండాలి. క్రైస్తవ జీవితాన్ని ఎట్లు జీవించాలో తెలిపే బైబిలును గూర్చి మనం కృతజ్ఞత కలిగి యుండాలి.

దేవుడు తన కుమారుని మన కొరకు యిచ్చుటలో లోతైన భావమున్నది. క్రొత్తనింబంధన అంతటిలోను మానవుని యెడల క్రీస్తుకున్న ప్రేమను గూర్చి చదువుతాము "నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడి యున్నాను ; ఇకను జీవించువాడును నేను కాను. క్రీస్తే నాయందు జీవించు చున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించు కొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను." (గలతీ 2:20). మన యెడల దేవుని కున్న ప్రేమను బట్టి దనాపేక్ష వలన కలుగు ప్రమాదములను గూర్చి క్రొత్తనిబంధనలో ఆయన మనలను హెచ్చరించుచున్నారు. మానవుని వివేకమును ధనం నాశనం చేయగలదు. "సణుగు కొనకయు బలవంతముగా కాకయు ప్రతి వాడును తన హృదయములో నిశ్చయించు కొనిన ప్రకారం ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా యిచ్చువానిని ప్రేమించును" అని క్రొత్తనిబంధన బోధించుచున్నది (2 కొరింధీ 9:7).

ధారళముగా ఎట్లు ఇయ్యాలో క్రొత్తనిబంధన మనకు బోధించుచున్నది. ఎప్పుడు ఇయ్యాలో కూడా అది బోధించుచున్నది. "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతై నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి; నేను వచ్చినప్పుడు చందాపోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్థిల్లిన కొలది తన యొద్ద కొంత

సొమ్మునిలువ చేయువలెను (1 కొరింధి 16:1-2). ఎవరు ఇయ్యాలో కూడ దేవుడు చెబుతున్నారు. "మీలో ప్రతివాడును. "మొదట ఒకడు సిద్ధమైన మనస్సు కలిగి యుంటే శక్తికి మించి కాదు గాని కలిమి కొలదియే యిచ్చినది ప్రీతికరమగును" (2కొరింధీ 8:12).

ఎంత యియ్యాలి? "తాను అభివృద్ధి జెందినకొలదీ". ఎందుకు ఇయ్యాలి ? అందరికీ సువార్త అందియ్యబడునట్లు, ఆకలి గొన్న వారికి ఆహారము దొరుకునట్లు, సత్కార్యములు జరుగునట్లు మనం ఇయ్యాలి. నిజంగా బైబిలు ఇచ్చుటను గూర్చిన గ్రంధము.

V.P. బ్లేక్

ప్రకటన గ్రంధ ప్రసంగ మాలిక - 29

# అంతిమ తీర్పు

## (The Fina Judgement)

**పరిచయము :**

ప్రకటన గ్రంధంలో అనేక తీర్పు దృశ్యములు కనబడును. వాటిలో యేదీ అంతిమ తీర్పు దృశ్యము కాదు.

1. జనాంగముల తీర్పు (ప్రకటన 11:18) లో కనబడును.

2. పరిశుద్ధులను చంపిన వారిపై తీర్పు (ప్రకటన 16:5-6).

3. వేశ్యయైన రోమాపై తీర్పు. (ప్రకటన 18:8; 19:2).

4. క్రూరమృగము, అబద్ధప్రవక్త పై తీర్పు (ప్రకటన 19:11-21).

5. ప్రకటన 20:11-15 లో అంతిమ తీర్పు.

**ధవళవమైన మహాసింహాసనము (20:11)**

అది మహా సింహాసనము, ఫరో చక్రవర్తుల సింహాసనము కంటె అది గొప్పది. నెబుకద్నెజరు సింహాసనము కంటె గొప్పది. అలెగ్జాండరు చక్రవర్తి సంహాసనము కంటెను, కైసరుల సంహాసనము కంటెను అది మహాగొప్పది.

మానవ చరిత్ర అంతటిలో యున్న సంహాసనములన్నింటి కంటే క్రీస్తు సింహాసనము మహా గొప్ప సింహాసనము. ఎందువలన? క్రీస్తు రాజులకు రాజును, ప్రభులకు ప్రభువై యున్నందు వలన (ప్రకటన 17:4).

- ఆయనది తీర్పు సింహాసనము గనుక అన్ని సింహాసనములు కంటె అది మహాగొప్పది.

- గొప్ప సంగతులు దాని సమక్షమునకు

వచ్చును గనుక అది మహా సింహాసనము.
- గొప్ప నిర్ణయములు అక్కడ గైకొనబడును గనుక అది మహా సింహాసనము.
- ఈ సింహాసనము పై నున్న క్రీస్తు మనందరిని ఎడమవైపు మేకలతో గాని కుడివైపున గొర్రెలతో గాని చేర్చును (మత్తయి 25:31-34).
- ఈ సింహాసనము సముఖము నుండి మానవులందరు పరలోకానికో లేక నరకానికో పోవుదురు.

**అది ధవళ సింహాసనము**

- అనగా తెల్లని సింహాసనము తెలుపు పవిత్రతకు, పరిశుద్ధతకు, మహిమకు సూచన. దానిపై కూర్చొన్నవాడు పవిత్రుడు, పరిశుద్ధుడు, మహిమగలరాజు!
- దాని యందు ఆసీనుడై యున్నావాడు యేసు క్రీస్తే (2 కొరింధి5:10 ; యోహాను 5:22; అపొ.కా. 10:42).

"భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను" భూమి, ఆకాశములు నశించునని కీర్తన 102:25-26 చెప్పుచున్నది.

ఆకాశమును భూమియు నశించునుగాని నా మాట ఎన్నడు గతించదని యేసుబోధించెను (మత్తయి 24:35).

భూమియు దాని మీద నున్న కృత్యములన్నీ కాలిపోవునని పేతురు బోధించాడు. 2 పేతురు 3:7-12.

"వాటికి నిలువ చోటు కనబడకపోయెను". పదార్థము శాశ్వతము కాదు ( Matter is not eternal ). దేవుడు భూమిని బాగు చేసివెయ్యేండ్ల పాలన స్థాపించడు. భూమ్యాకాశములు లయమై పోవును.

**సార్వజనిక పునరుత్థానము : (20 : 12-13).**

"మరియు గొప్పవారేమి, కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము యెదుట నిలువబడి యుండుట" యోహాను చూచెను.

-యోహాను మృతులైన వారిని చూచెను, వారిలో గొప్పవారు, కొద్దివారు ఉండిరి. వారికి తీర్పు తీర్చబడెను.

- క్రీస్తు గొర్రెలకు మేకలకు తీర్పు తీర్చును. (మత్తయి 25:32). మృతులకు సజీవులకు తీర్పు తీర్చును (2తిమోతి 4:1). "అప్పుడు గ్రంధములు విప్పబడెను"
- వేవేల కొలది, కోట్లకొలది మనుష్యులు ఆయన యెదుట నిలువగా తీర్పు తీర్చుటకై గ్రంధములు విప్పబడిన దృశ్యాన్ని దానియేలు కూడ చూచాడు (దానియేలు 7:10). ఈ గ్రంధములు యేమిటి ?

**1. ప్రకృతి గ్రంధము : The book of Nature**

"ఆకాశములు దేవునిమహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచుర పరచుచున్నది" (కీర్త 19 :1).

" ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన వాటిని తేటపడుచున్నవి". చదువుట ద్వారా దేవుని తెలిసికోవచ్చును.

**2. జ్ఞాపకార్థ గ్రంథము :**

"యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన నామమును సర్మించుచు ఉండువారికి జాపకార్థముగా ఒక గ్రంథము ఆయన సముఖమందు వ్రాయబడెను" (మలాకీ 3:16).

**3. పాతనిబంధన గ్రంథము:**

"పాతనిబంధన క్రీస్తు యొక్క అవతారమును గూర్చి, దైవత్వమును గూర్చి సాక్ష్యమిచ్చుచుండెను. యూదులు పరిశోధించుచున్న లేఖనములు క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుచుండెను. (యోహాను 5:39).

**4. క్రొత్త నింబధన గ్రంథము:**

"మనము క్రీస్తు చెప్పిన మాటల చొప్పున తీర్పు తీర్చబడుదుము (యోహాను 12:48). సువార్త ప్రకారము మనకు తీర్పు తీర్చబడును (రోమా 2:16). ఇంత ... ప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుట చేత ఆరంభమై దేవుడు తన చిత్తాను సారముగా సూచక క్రియల చేతను , వివిధములైన పరిశుద్ధాత్మ వరములన అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారి చేత మనకు దృఢపరచబడెను.

**5. క్రియల గ్రంధము :**

"మనక్రియల ప్రాముఖ్యతను మత్తయి 25:31–46 లో చూడగలము. ఆయన ప్రతి వానికి వానివాని క్రియల చొప్పున ప్రతి ఫలమిచ్చును (రోమా 2:6). క్రియలు లేని విశ్వాసము మృతము (యాకోబు 2:14,17,24,26). మృతిజెందిన తరువాత మన క్రియలు మన వెంట వచ్చును. ప్రకటన 14 :13). అవి మనము నీతిని అనుసరించి చేసిన క్రియలు కాదు (తీతు 3:5), గాని అవి దేవుని క్రియలే (యెహాను 6:29).

**6.జీవగ్రంథము :**

"మోషే, దావీదులు ఆ గ్రంధమును గూర్చి ఎరుగుదురు (నిర్గమ 32.33; కీర్తన 69:28). దేవుని ప్రజల పేర్లు అందుండును (ఫిలిప్పీ 4:3). దానిలో పేర్లు వ్రాయబడినను అవి తుడుపు పెట్టబడవచ్చునని

మరచిపోవడం (ప్రకటన 3:5). జీవగ్రంథములో ఎవని పేరుండదోవాడు పరలోకములో ప్రవేశింప లేడు (ప్రకటన 20:15: 21:27). ఈ గ్రంథములో మనము పలికిన మాటలుండును (మత్తయి 12:35-36). మన హృదయాలోచనలు అందుండును (1కొరింధీ 4:5). "సముద్రము తనలోనున్న మృతులను అప్పగించెను, మరణమును పాతాళలోకమును వాటి వశమునున్న మృతులను అప్పగించెను"

-సముద్రములో చనిపోయినా, భూమిలో పాతిపెట్టబడినా, మృతులైన వారందరు ఆయన సముఖమున తీర్పునాడు నిలుతురు. పాతాళలోకము మృతులైనవారి ఆత్మలు తీర్పు కొరకు కనిపెటుకొని యుండు ప్రదేశము.

**కడవరి శత్రువు యొక్క నాశనము (20:14).**

"మరణమును మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయబడెను".

- కడపట నశింపజేయబడు శత్రువు మరణము అని పౌలు బోధించాడు (కొరింధి 15:26). పౌలు ద్వారా పరిశుద్ధాత్ముడు చేసిన వాగ్ధానము ఇక్కడ నెరవేరును.

-అందు వలన మనం విజయగీతము పాడవచ్చును "ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, విజయ మందు మరణము మ్రింగి వేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. ఓ మరణమా, నీముల్లెక్కడ? మరణపు ముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే. అయినను మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక !" (1కొరింధి 15:54 -57).

-అగ్నిగుండము, రెండవ మరణము. యిది సమూల నాశనము ( annihilation) కాదు. మానవుని ఆత్మ నిత్యముండును. మానవుని ఆత్మను నాశనం చేయాలని అపవాది తన శాయశక్తులా ప్రయత్నించును. వానిని రక్షించాలని క్రీస్తు శాయశక్తులా పని చేయును.

**నశించిన వారి కడమ అంతము :(20:15)**

"ఎవని పేరైనను జీవగ్రంధ మందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్ని గుండములో పడవేయబడును".

-రక్షణషరతులతో కూడినట్టిది. మనం ఆయన ఆజ్ఞలను పాటిస్తే ఆయన నెరుగుదుము (1యోహాను 2:3; యోహాను 17:13).

-క్రైస్తవులు కాని వారి పేర్లు జీవగ్రంథమందుండవు. క్రీస్తుసంఘమందున్న వారి పేర్లు పరలోకమందు వ్రాయబడి యున్నవి. (హెబ్రీ 12:23).

-ఒకని పేరు జీవగ్రంథ మందు లేకపోతే బహుశ అదితుడుంపు పెట్టబడెనేమో. యిదికూడ సాధ్యమే (నిర్గమ 32:32: ప్రకటన 3:5). గనుక అంతము వరకు నమ్మకముగా జీవించాలి.

-జీవగ్రంథమందు తమ పేర్లు లేని వారు అగ్నిగుండములో పడవేయబడుదురు. యిది రెండవ మరణం నిత్యనరకం. క్రీస్తు రెండవ రాకడలో సమాధులలో నిద్రించువారు మేలుకొనెదరు. కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును మేలు కొందురు"

**ముగింపు :**

సాతానుడు మన బద్ధ శత్రువు. దెబ్బతగిలిన మృగము వలె వాడున్నాడు. మన ఆత్మలను నాశనం చేయడానికి వాడు ప్రయత్నించుచునే యుండును. గాని వాని అంతము మన మెరుగుదుము. గనుక ఆనందించాలి, నరకం యదార్థం. దానిలో పడవేయబడ కుండాలంటే దేవుని గ్రంధాన్ని చదివి, దాని చొప్పున నడుచుకోవాలి. తీర్పు మన పరీక్ష సమయం. బైబిలు మన అచ్చు పుస్తకం, నీవు అంతిమ పరీక్షలో విజయం కొరకు సిద్ధపడియున్నావా? నీ పేరు జీవ గ్రంథములో వ్రాయబడి యున్నదా? అట్లయితే ధన్యుడవే లేకపోతే నరకమే !!

**బైబిలు సర్వే**

## పాపము -దాని (వలన వచ్చు) ప్రతిఫలము

యేసుక్రీస్తు లోకానికి వచ్చిన ముఖ్యకారణం మానవుని పాపములనుండి రక్షించుటకు. ప్రధాన కారణాన్ని గ్రహిస్తేనే కాని మనం ఆయనయందు విశ్వాసముంచుట వ్యర్థము. దీని తరువాత పాఠములో క్రీస్తుద్వారా పాపక్షమాపణ ఎట్లు జరుగునో నేర్చుకొనగలం. దానికిముందు ఈ పాఠంలో దాని ప్రతిఫలం గురించి నేర్చుకొందాం.

**పాపమనగా ఏమి?**

"ఆజ్ఞాతిక్రమమే పాపం" అని యోహాను బోధిస్తున్నాడు (1 యోహాను 3:4). దేశ చట్టాన్ని నైతికవిలువలను మీరటం దుర్మార్గత కానీ దేవుని ఆజ్ఞలను మీరటం "పాపం" -పాపం అనే మాటకు - గురితప్పుట యని మూల భాషకు

అర్థం. ఎందుకంటే దేవుని చిత్తాను సారంగా జీవించటమే మన గురి. ఎప్పుడెప్పుడు మనం దానికి అవిధేయత చూపుతున్నామో అప్పుడే పాపం చేస్తున్నాము.

చాలా విధములైన పాపాలు వాటి నైజాన్ని బట్టి చూస్తే అవి అనైతికమైనవి. వాటిలో కొన్ని త్రాగుడు, విగ్రహారాధన వ్యభిచారము మొదలగునవి, కాని "నైతిక కట్టుబాట్లు" గా దేవుని వాక్యములో చెప్పబడ్డాయి. యోహాను యీవిధమైన కార్యా లన్నిటిని క్రోడీకరించి శరీరకార్యాలని చెప్పి తన ప్రతికలో యీలాగు చెపుతున్నాడు: "సకలవిధమైన దుర్నీతి పాపము" (1యోహా. 5:17).

మంచిని చేయకపోవటం కూడా పాపమని దైవ గ్రంథం ఖండించింది. మేలైనది చేయనెరిగియూ అలాగు చేయని వానికి పాపము కలుగును (యాకోబు 4:17). ఉదాహరణకు : క్రైస్తవులు రోగ గ్రస్తులను దర్శించాలని మత్తయి 25:36 లో వ్రాయబడింది కానీ ఎవరైనా రోగంతో బాధపడుచున్నారని తెలిసి కూడా వారిని దర్శించకుండటం పాపం చేసినట్లే. దేవుడు వేటినైతే చేయాలని ఆజ్ఞాపించాడో వాటిని మనం చేయాలి.

ఇంకో విధమైన పాపం ఏమిటంటే దేవుని ఆజ్ఞలో నైతికమైనా సిద్ధాంతము లేనట్లు మనకు కనుపించినా దానిని నెరవేర్చకపోతే పాపం. ఉదాహరణకు అమాలేకీయులను పూర్తిగా నాశనము చేయమని" దేవుడు రాజైన సౌలుకు ఆజ్ఞాపించాడు. కానీ దేవుని కన్న తనకే ఎక్కువ జ్ఞాన మున్నట్లుగా రాజును, కొన్ని పశువులను దేవునికి బలి యిచ్చుటకు సౌలు చంపక జీవముతో వుంచెను. ఇచ్చట నైతికముగా ఏమీతప్పు చేయకపోయినప్పటికీ సౌలు దేవుని ఆజ్ఞకు అవిధేయత చూపుట ద్వారా పాపం చేసెను. ఈ విధముగా దేవునికి అవిధేయత చూపుట ద్వారా క్రైస్తవులు ఈ రోజులలో పాపము చేయవచ్చు. ఉదాహరణకు ప్రభు రాత్రి భోజనము నందు రొట్టె, ద్రాక్షారసము తీసుకోవలసినదిగా యేసు చెప్పారు. కానీ కోడె మాంసం, నారింజ రసం రొట్టెకు ప్రతిగా తీసుకోవచ్చా? ఆజ్ఞను మార్చి అవిధేయత చూపుటద్వారా పాపంము చేసినట్లే.

చిన్న పెద్ద పాపాలు వున్నవని బైబిలు చెప్పుట లేదు. చిన్న తప్పేకదా ఫరావాలేదు అని చెప్పుట లేదు. ఒకటి చాలా పెద్ద తప్పుతప్పక శిక్ష అనుభవించాలనీ చెప్పుట లేదు. కానీ "అబద్ధికు లందరూ అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు" (ప్రకటన 21:8). అని బైబిలు బోధించుచున్నది. యదార్థ

మేమిటంటే పాపం యొక్క పర్యవసానం ఒక్కోసారి ఒకదాని కన్నా ఒకటి దౌర్భాగ్యంగా వుంటుంది. మనం నరహత్య చేయకుండా మనిషిని అసహ్యిస్తూ ద్వేషించినాడు కూడా నిత్యజీవాన్ని కోల్పోయినట్లే. ద్వేషించినవాడు కూడా నిత్యజీవాన్ని కోల్పోతాడు. యోహాను ఇలా చెప్పుచున్నాడు. "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు; ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీ రెరుగుదురు " (1యోహాను 3:15).

**పాపము - దాని ఫలము**

మంచిచెడ్డల జ్ఞానవు నిచ్చువృక్షఫలము తినకూడదని ఆదాముతో దేవుడు చెప్పి అతడు తినిన దినమున నిశ్చయముగా మరణింతువు అని చెప్పారు (ఆది 2:17). ఆదాము పాపముచేసి ఒకప్పుడు శారీరకముగానూ ఆత్మీయముగానూ అతడు చనిపోయాడు. దేవుని ఆజ్ఞను అతిక్రమించుట ద్వారా ఆదాము చాలా సంవత్సరాలకు చనిపోయాడు. అతని సంతానానికి మరణం సంప్రాప్తమైనది.

ఇచ్చట మనం గ్రహించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆదాము పాపముచేసిన మరుక్షణవే దేవుని సన్నిధినుండి తోటలోనుండి దూరముగా త్రోయబడ్డాడు. ఆలాగు ఆత్మీయముగా మరణించాడు. భౌతిక మరణ మనగా శరీరమునుండి ప్రాణము వేరుచేయబడుట.

ఆత్మీయమైన మరణం పాపఫలం "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మనప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23). ఇంకా (రోమా 8:13). లో "మీరు శరీరానుసారముగా ప్రవర్తించినయెడల జీవించెదరు". పౌలు ఇచ్చట శరీరమరణం గురించి చెప్పుటలేదు. ఎందుకంటే శారీరకంగా జీవించినా ఆత్మానుసారంగా జీవించినా ఆత్మానుసారంగా జీవించినా మన మందరము శరీరమరణం పొందుదుము. మీ అపరాధములచేతను పాపము చేతనూ మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడా బ్రతికించెను (ఎఫెసి 2:1). మరియూ మీరు అపరాధముల వలనను శరీరమునందు సున్నతి పొందక యుండుట వలననూ మీరు మృతులైయుండగా, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మన మీద ఋణముగాను మనకు విరోధముగానూ వుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తివేసి,

మన అపరాధము లన్నిటినీ క్షమించి ఆయనతో కూడా మనలను జీవింపజేసెను (కొలస్స 2:13-14). కాబట్టి ఒకడు శారీరకముగా జీవించి వున్నప్పుడే ఆత్మీయముగా బ్రతికించబడాలి లేనియెడల అతుడు చనిపోయిన తరువాత దేవుని నుండి వేరుచేయబడును ప్రకటన 21::8).

## పాపము -వారసత్వము వలన పొందదగినదా?

మనం మన తల్లితండ్రులు, ఆదాము చేసిన పాపాన్ని వారసత్వముగా పొందుదుమా లేక కేవలం మాన పాపముల నిమిత్తమే మనం లెక్క చెప్పుకోవాలా? మనం కేవలం మాన పానముల నిమిత్తమే దేవునికి లెక్క ఒప్పజెప్పుకోవాలని బైబిలు చాలా స్పష్టంగా చెప్పుచున్నది. అంతేకాని మన పూర్వీకులు చేసిన పాపముల నిమిత్తము మనం జవాబుదారులం కాము. మనలో ప్రతివాడును తన్ను గూర్చి దేవునికి లెక్క యొప్పగించవలెను (రోమా 14:12). ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైననూ సరే, చెడ్డవైననూ సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతీవాడునూ పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును (2 కొరింధి 5:10). ఏ భేదమును లేదు. అందరునూ పాపముచేసి దేవుడను గ్రహించు మహిమను పోందలేకపోవుచున్నారు (రోమా 3:23). పౌలు వ్రాసిన సంగతి గమనించవలసిన దేమంటే మన స్వంత పాపముల వల్ల దేవుని మహిమను పొందలేకపోవుచున్నాము. కానీ మన పూర్వీకుల పాపములను మనం సంతరించుకొనుటద్వారా కాదు.

ఆదాము యొక్క పాపములతో ఒక పసివాడు జన్మించును అనే సిద్ధాంతాన్ని "జన్మపాపము"అని అంటారు. ఏవిధమైన పాపము చేయని ఓ చిన్న పసిబిడ్డ బాప్తిస్మము పొందకపోయినట్లైతే తల్లి దండ్రుల పాపము వల్ల నిత్యనాశనమునకు గురికావలసినదే. ఈ జన్మపాప మనెడి అలోచన బైబిలు నందు ఎచ్చటను కానరాదు. పాపముచేయువాడే మరణము నొందును, తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదు, కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు (యెహెజ్కేలు 18:20). ఇంకొకమాటలో చెప్పాలంచే బిడ్డ తల్లిదండ్రుల పాపాలకు జవాబుదారు కాదు.

ఈ బోధ పాపము ఇతరుల

నుండి పొందేది కాదని ఖండిస్తున్నది. పాపముక్రియచేయుట ద్వారా వచ్చేది. అంటే ఆజ్ఞాతిక్రమమే పాపము -(1యోహాను 3:4). కనుక పాపాన్ని యితరులనుండి పొందము. ఎలాగంటే వంటచేయటం, కారునడపటం అనేవి క్రియలే కానీ ఇతరుల రుండి సంక్రమించుకొనే గుణాలు మాత్రం కాదు.

ఒక వేళ చిన్న పిల్లలే పాపముతో పుట్టియున్నట్లైతే మనం వారిలా వుండాలని వారినే ఉదాహరణగా యేసు తీసుకొనేవాడు కాదు. మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతే గాని పరలోకరాజ్యములో ప్రవేశింపనేరరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మత్తయి 18:3). యేసు పాపాత్ములైన పిల్లలవలె వుండాలని చెప్పుట లేదు. తన శిష్యులు నిత్య నాశనము పొందాలని ఆయన కోరుటలేదు. మనము దేవుని సంతానము (అ.కా. 17:29). ఆత్మను దేవుడు మన కనుగ్రహించాడు (ప్రసంగి 12:7). మనం దేవుని సంతానం కాబట్టి ఆయనయొద్ద నుండి పాపాన్ని పొందుతున్నామా ? ఎంత మాత్రమూ కాదు. ఎందుకంటే దేవుడు పరిశుద్ధుడు. ఆయనలో పాపము ఎంతమాత్రం లేదు.

కనుక మన తల్లిదండ్రుల యొద్దనుండి మనం ఏది పొందుతున్నాము? మంచి జ్ఞానాన్ని పొందుతున్నాము? మరియూ మానవ బలహీనత. దీని ద్వారానే కొంతకాలానికి పాపం చేస్తాము. మనం ఆదాము పాపదోషాన్ని పొందము. పిల్లవాడు పెద్దవాడై తనంతతాను పాపంచేసే వయసువచ్చే వరకూ చాలా పవిత్రుడు. ఎంత పవిత్రుడంటే శీతాకాలం కురిసే మంచు ఏదోషములేకుండా ఎలా వుంటుందో అంత పవిత్రుడు.

## గమనిక

సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ ॥లు విధిగా పంపవలెను

Satya Vani, P.O. Box - 80, Kakinada - 533 001

# దేవుని యొక్క కాపుదల

## (The Providence of God)

Providence of God అనగా దేవుడు దీర్ఘదృష్టి గలవాడు అను భావమును తెలియ జేయుచున్నది. ఆ పవిత్రమైన పదమును గ్రీకు భాషలో తర్జుమా చేయగా, ఆ పదము యొక్క అర్థమును చెప్పు శైలి "దేవుని ఏర్పాటు లేక కాపుదల అను భావమును తెలియజేయుచున్నది. "To Provide for భవిష్యత్తును సిద్ధపర్చుట" అనియు అర్థ మిచ్చుచుండెను.

"దైవ నిర్ణయము" అను పదము యొక్క నిర్వచనము దేవుని స్వభావ లక్షణము నందు ఒక భాగముగా యుండవచ్చును. ఎందుకనగా ఆయన తన సృష్టిని కాపాడుటకును, భద్ర పరుచుటకును, పరిపాలించుటకును దీర్ఘదృష్టి (ముందుచూపు) గలవాడై యున్నాడు.

కాపుదల అను పదమునందు రెండు రకములు గలవు 1) సామాన్యమైనది. 2)అసమాన్యమైనది. (ప్రత్యేకమైనది). మొదటిది. సామాన్యమైన మార్గము. దేవుడు తన సృష్టిని ప్రమాదమునుండి కాపాడును, దానిని పోషించుచుండును.

ఆయన చెడ్డవారి మీదను , మంచి వారి మీదను తన సూర్యుని ఉదయింప జేసి నీతిమంతుల మీదను, అనీతి మంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు (మత్తయి 5:45).

దేవుడు తన మహాత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నాడు. (హెబ్రి 1:3).

దేవుడు తన ప్రజలపై అసాధారణమైన దీర్ఘదృష్టిని కూడా ప్రయోగించుచున్నాడు.

భక్తులను శోదనలో నుండి తప్పించుటకు ప్రభువు సమర్థుడని పేతురు రూఢిగా తెలియజేయుచున్నాడు (2పేతురు 2:9). "మమ్మును తప్పించుము" అని ప్రార్థించుడని యేసు తన శిష్యులకు బోధించెను (మత్తయి 6:13). అది దేవుని ఏర్పాటై యున్నది. లేక దేవుని నిర్ణయమైయున్నది.

దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువ బడినవారికి, మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవి (రోమా 8:28).

దూరదృష్టి గల దేవుడు మన అవసరతలు సరఫరా చేయును.

దేవుడు తన ఐశ్వర్యము చొప్పున

క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును (ఫిలిప్పి 4:19).

దేవుడు తన నిర్ణయము ప్రకారముగా తన ప్రజలను కాపాడును. "విత్తు వానికి విత్తనమును, తినుటకు ఆహారమును దయచేయు దేవుడు మీకు విత్తనము దయచేసి, విస్తరింపచేసి, మీరు ప్రతి విషయములో పూర్ణౌ దార్య భాగ్యము గలవారగునట్లు మీనీతి ఫలములు వృద్ధిపొందించును (2కొరింథి 9:10).

యెహోవా దృష్టి నీతిమంతుల మీద నున్నది. ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గియున్నవి. దుష్ క్రియలు చేయువారి జ్ఞాపకమును భూమిమీద నుండి కొట్టివేయుటకై యెహోవా సన్నిధి వారికి విరోధముగా నున్నది. నీతి మంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును. వారి శ్రమలన్నిటిలో నుండి వారిని విడిపించును. (కీర్తనలు 34:15-17).

దేవుని నిర్ణయమును బట్టి రాజ్యములను పాలించును. జనులను విస్తరింపజేయును., నిర్మూలము చేయును. సరిహద్దులను విశాలపర్చును జనులను కొనిపోవును (యోబు 12:13, కీర్తనలు 22:28, దానియేలు 5:21 అ॥ కార్యములు 17:26).

ఎప్పుడైనను, ఏ సమయమందైనను కొన్ని విషయాలు న్యాయయుక్తముగా లేనప్పుడు సత్యము, న్యాయము త్రొక్కి వేయబడి నలుగగొట్టబడినపుడు, దేవుడు తన నిర్ణయము యొక్క సాధన ప్రకారము, నిశ్చయముగా విశ్రాంతిని అనుగ్రహించును.

James Russell Lowell అనునడు తన కావ్యము (పద్యము ) నందు దేవుని భవిష్యత్ జ్ఞానము యొక్క సారాంశమును గ్రహించి వ్రాసెను.

దేవుని రంగముల వెనుక ఆయనకు తగినట్టుగా దేవుని కార్యముల యొక్క వివరణముల మధ్య, ఆయన స్వకీయమైన ఛాయలు అన్నిటిని మించి యుండెను, అందువలన మనము దేవునిని ఎన్నడును చూడలేదు గాని ఆయన క్రియలుచేయుచు ఉన్నాడని మనుము ఎఱుగుదుము.

ఈ లోకములో దుష్టత్వము వ్యాప్తి చెందుచున్నట్లుగా కనబడుచున్నప్పుడు మనము దేవుని విశ్రాంతిని నిశ్చయముగాఅనుభవించెదము. ఆయన తన స్వంత నీడలో మన మధ్య నిలువబడి కాపలా కాయును.

మన జీవితాలలో అనేక విషయాలు న్యాయ యుక్తముగా ఉండవు . గనుక మన హృదయాలు ఎప్పటికిని తప్పిపోకుండ కాపాడుకోవలసిన బాధ్యత కలిగి యుండవలెను.

ఎల్లప్పుడు దేవుడు మన భారము

వహించువాడని జ్ఞాపక ముంచుకొనుము.

"ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" (రోమా 8:28).

డేన్ ఫ్లోర్నోయ్

# నీవు క్రైస్తవుడవు కాగోరుచున్న యెడల ....."

## (To become a Christian.....)

నీవు మొదట దేవుని వాక్యమును విని, దేవుని యందును యేసుక్రీస్తునందును విశ్వాసముంచవలెను

:ఎ) "కాగా వినుట వలన విశ్వాసము కలుగును ; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును " (రోమా 10:17).

బి) "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము ; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11 :6).

సి) "నమ్ము ప్రతివానికి ....రక్షణ కలుగజేయుటకు సువార్త దేవుని శక్తియైయున్నది. ఎందుకనిన, నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాము మూలముగా అంత కంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దాని యందు బయలుపరచబడుచున్నది" (రోమా 1:16,17).

డి) మీరు దేవుని యందు విశ్వాసముంచుచున్నారు, నా యందును విశ్వాసముంచుడి" యని యేసు చెప్పెను (యోహాను 14:1)."నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీపాపములలోనే యుండి చనిపోవుదురని " ఆయన చెప్పెను(యోహాను 8:24). నీ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను.

ఎ) "మీరు మారుమనస్సు పొందనియెడల మీరుందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3,5).

బి) ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను ; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. (అపొ.కా. 17:30).

యేసుక్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను.

ఎ) "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందునని" క్రీస్తు చెప్పెను(మత్త 10:32).

బి) "యేసు ప్రభువని నీనోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9).

నీవు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను:

ఎ) "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి " (అపో.కా. 2:38).

బి) "గనుక నీవు తడవుచేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పావములను కడిగివేసికో" (అపో.కా. 22:16).

సి)" దానికి సాదృశ్యమైన బాప్తిస్మ ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1పేతురు 3:21).

డి) "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు." (గలతీ 3:27).

5. నీవు పై విషయములకు లోబడిన యెడల క్రైస్తవుడ వగుదువు. క్రీస్తు సంఘములో చేర్చబడుదువు:

ఎ) "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి ; ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి". "మరియు ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను" (అపో.కా. 2:41,47).

బి) "మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి (1కొరింధి 12 :13).

6. క్రీస్తు సంఘములో చేర్చబడిన తరువాత నమ్మకమైన క్రైస్తవులతో స్థానిక క్రీస్తు సంఘములో నీవు ఆయన నారాధించి ఆయనకు పనిచేయవలెనని దేవుడు నిన్ను కోరుచున్నాడు. అట్లు చేయుటలో దేవుడు నిన్ను, నీ జీవితమును అంగీకరించును. "యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును ; నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6).

"క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16).

**గమనిక:**

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **సత్యవాణి**T.V. కార్యక్రమమును T.V.-5 లో ప్రతి శనివారం ఉదయం 6.30 గంటలకు **శుభవార్త** ఛానల్‌లో ప్రతి సోమ,మంగళ వారాల్లో ఉదయం 6 గం॥కు టి.వి. ద్వారా సువార్త వినండి!

## సంక్షిప్త వార్తలు - 2

సోమవారం మధ్యాహ్న కూటములో మణిపూర్ నుండి వచ్చిన శ్యామ్‌సలామ్ గారు "మనుష్యకుమారుడు" అను అంశమును గూర్చి ఉపదేశించగా బిల్లీ బ్లేండ్ గారు వాద్యసంగీతము అను అంశముపై సవిస్తరముగా బోధించిరి. దేవుడు ప్రతి వానికి ఒక పరికరము నిచ్చెనని, ఆరాధనలో దానని వినియోగించాలని, అదే హృదయమని ఆయన చెప్పారు. అందు వలన క్రైస్తవులు కూడి వచ్చినప్పుడు హృదయములో పాడుచు దేవుని స్తుతించాలని, ఒకనినొకడు బోధించాలని, మానవ కల్పిత వాద్యములకు ఆరాధనలో స్థానము లేదని బ్లేండ్‌గారు బోధించారు.

సోమవారం రాత్రి స్కాట్ ఇలియట్‌గారు, వి. సుదర్శనరావు (రాజమండ్రి) గారు బోధించిరి. తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు అను అంశముపై సోదరులు సుదర్శనరావుగారు చక్కగా విశ్లేషించిరి, సందేహములను వైదొలగించిరి.

డిసెంబరు 2, మంగళవారం డేరిన్ కెన్నెడిగారు ప్రార్థన గూర్చి, స్కాట్ ఇలియట్ గారు సబ్బాతును గూర్చి బోధించగా, ఆమధ్యాహ్న కాలములో సోదరులు నెహెమ్యాగూటంగారు, వి. సుదర్శనరావు గార్లు ఉపదేశించిరి.

మంగళవారం సాయంత్రం జిమ్‌కెల్లీ గారు భయపడకుడి అను అంశముపై గంభీరోపన్యాసము చేయగా, గేరీయంగ్ గారు పరిసయ్యులను గూర్చి ఉపదేశించిరి.

డిసెంబరు 3, బుధవారం ఉదయం డేరిన్ కెన్నెడీగారు దయను గూర్చి, స్కాట్ ఇలియట్‌గారు శిష్యత్వమును గూర్చి ఉపదేశించిరి. ఆమధ్యాహ్నం శ్యామ్‌సలామ్‌గారు పునరుద్ధరింపబడుటను గూర్చియు, గేరీయంగ్ గారు ధనాన్ని గూర్చి యేసు చేసిన బోధలను వివరించిరి.

డిసెంబరు 4వ తేదీ గురువారం ఉదయం గేరీ యంగ్‌గారు స్త్రీలనుగూర్చి, జిమ్‌కెల్లీగారు క్షమాపణను గూర్చి యేసు చేసిన బోధనలను వివరించిరి. లెక్చరర్‌షిప్ అంతటిలోను, 7 గురు క్రీస్తులోనికి

బాప్తిస్మము పొందిరి. ప్రతిదినము, ప్రతి కూటములోను సత్యవాణి భవనము ప్రజలతో నిండి యుండెను. పలు ఆత్మీయపాటలు, ప్రసంగములు, ఉపన్యాసములతో సత్యవాణి ఆవరణం అంతా దేవునికి స్తుతిచెల్లించు ప్రాంగణమాయెను. హాజరైన వారందరికీ రోజుకు మూడు మారులు రుచి, శుచిగల భోజనము సరఫరా చేయబడెను. దూరప్రాంతములనుండి వచ్చినవారికి మంచి వసతి సదుపాయములు ఏర్పాటు చేయబడెను. లెక్చరర్‌షిప్ డైరెక్టర్ రిక్కీ గూటం గారు అమితముగా శ్రమించి సమస్తము సక్రమముగా జరుగులాగున విస్తృత ఏర్పాట్లు చేసిరి. వారికి అందరూ అభినందనలు తెలియ జేసిరి. హాజరైన వారు కొన్ని క్రొత్త పాటలు నేర్చుకొనిరి. ఆత్మీయ సంతృప్తితో తమ తమ గ్రామములకు, పట్టణములకు గురువారం మధ్యాహ్నం, ఆఖరి కూటము అనంతరం తిరిగివెళ్లిరి. ఏషియన్ బైబిలు లెక్చరర్‌షిప్‌కు హాజరైన వారందరినీ దేవుడు దీవించును గాక! ఉపన్యాసకులకందరికీ మా నిండు వందనములు. ఇటువంటి ఆత్మీయ సంతృప్తినిచ్చు ఉపన్యాసకూటములు ప్రతి సంవత్సరము జరిగించుటకు ప్రయత్నించెదమని రిక్కీగారు తెలియజేయగా అందరు ఆయనతో ఏకీభవించిరి. ఈ కూటములను దేవుడు జరిపించినందుకు ఆయనకు స్తోత్రములు.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:
**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 001.